క్లుప్తంగా

కంకిపాడులో ఉచిత వైద్య శిబిరం



కంకిపాడు: రమీజా ఆర్థోపెడిక్ సెంటర్ ఆధ్వర్యాన కంకిపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎముకల పటుత్వ పరీక్షలు చేశారు. 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని డాక్టర్ హమీద్ రజా, డాక్టర్ ఎస్.కాలేషావలి పర్యవేక్షించారు.

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో గల దాసాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలోని 45 అడుగుల హనుమాన్ విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏకధాటిగా 12 గంటల పాటు హరేరామ హరేకృష్ణ ఏకనామాన్ని భక్తులు కీర్తించారు. వేలేరు, తాళ్లమూడి గ్రామాలకు చెందిన భజన సమాజం సభ్యులు హరేరామ హరేకృష్ణ.. కృష్ణకృష్ణ హరేహరే అంటూ నిరంతర భజన చేశారు. దాసాంజనేయస్వామి ఉత్సవమూర్తికి ఏపూరు, సీతారామపురం, బాపులపాడులో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వత్రాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరమా సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పలువురు దంపతులు సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతులు ఉచితంగా పూజా సామాగ్రిని వ్రతంలో పాల్గొన్న భక్తులకు అందించారు.

ప్రసూతి, సంతాన సాఫల్య చికిత్సలపై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రసూతి, సంతాన సాఫల్య చికిత్సల్లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక వైద్య పరిజ్ఞానంపై విజయవాడ నగరంలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, గైనకాలజీ సొసైటీ ఆఫ్ విజయవాడ, అను మై బేబీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో నిపుణులు అత్యంత క్లిష్టతరమైన ప్రసూతి కేసులు, పునరుత్పత్తి ఔషధ విభాగంలో విప్లవాత్మక ఆవిష్కరణలను వివరించారు. నూతన ఆవిష్కరణతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న తీరును వివరించారు. ఆధునిక ఔషధాల వినియోగం ద్వారా పునరుత్పత్తికి సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్, ఐఎంఏ విజయవాడ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చలసాని ప్రమోద్, డాక్టర్ అక్కినేని శివరామ్, ప్రసూతి వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, డాక్టర్ వెల్లంకి సుజాత, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభాదేవి, డాక్టర్ జి.శ్రీదేవి పాల్గొన్నారు.

మధుర స్వరాల కంఠశాల ఘంటసాల



విజయవాడకల్చరల్: మధుర స్వరాల కంఠశాల ఘంటసాల వెంకటేశ్వరరావు అని సుప్రీంకోర్ట్ న్యాయవాది డాక్టర్ జీవీఎన్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ అన్నారు. మహానటి సావిత్రి సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్ హాల్‌లో ఆదివారం గాయకుడు ఘంటసాల స్ఫూర్తి సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఘంటసాల స్వరం తెలుగు వారి గుండె చప్పుడుగా అభివర్ణించారు. కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఘంటశాల జీవితం నేటితరం గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన గాయకుడు శరత్‌చ్చంద్ర మాట్లాడుతూ ఘంటసాల లేని తెలుగు సినీ పరిశ్రమను ఊహించలేమన్నారు. గాయకుడు గుడిపాటి హరికృష్ణ, స్వాతి మీరా, విష్ణుప్రియ, రూపశ్రీ, డాక్టర్ జయంతి చక్రవర్తి ఘంటసాల స్వరపరచి గానం చేసిన గీతాలను మధురంగా గానం చేశారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

కౌంటింగ్ రోజు ప్రత్యేక చర్యలు

- పోలీసుల పర్యవేక్షణలోనే నేతలు
- రౌడీషీటర్లపై ఉక్కుపాదం

పెనమలూరు: సార్వత్రిక ఎన్నికల సమయంలో పెనమలూరు నియోజకవర్గం పోరంకి గ్రామంలో జరిగిన ఘర్షణల దృష్ట్యా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 4వ తేదీన కౌంటింగ్ జరిగే సమయంలో కేసుల్లో ఉన్న ఆయా రాజకీయ పార్టీల నేతలు పోలీసుల పర్యవేక్షణలోనే ఉండాలని ఆదేశించారు. ఇక రౌడీషీటర్లు పోలీస్‌స్టేషన్ వద్ద ఉండాలని నిర్ణయించారు. వివరాల్లోకి వెళితే పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆయా రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు కాలుదువ్వడంతో నియోజకవర్గానికి నియమించిన ప్రత్యేక అధికారిణి ఎస్పీ రజిని ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో గొడవలు జరగడంతో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు దాదాపు 80 మందిపై పోలీసులు కేసులు, బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఉన్న నేతలు, ఆయా పార్టీల కార్యకర్తలు కౌంటింగ్ రోజు మచిలీపట్నంకు వెళ్లరాదని హెచ్చరించారు. టీడీపీకి చెందిన వారిని కానూరు మన కల్యాణ మండపంలో, వైఎస్సార్ సీపీకి చెందిన వారిని అన్నే కల్యాణ మండపంలో ఉంచుతారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఇరు పక్షాల నేతలు పోలీసుల పర్యవేక్షణలోనే ఉండాలని ఆయా పార్టీలకు చెందిన నేతలను పోలీసులు ఆదేశించారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా..

కాగా మండల పరిధిలో దాదాపు 94 మంది రౌడీషీటర్లు పీఎస్ పరిధిలో ఉన్నారు. ఇందులో కొందరు



పెనమలూరు పోలీస్‌స్టేషన్

రౌడీషీటర్లు రాజకీయ పార్టీల నేతలతో చట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నారు. అలాగే కాల్ మనీ గాళ్లు కూడా యాక్టీవ్‌గా తిరుగుతున్నారు. ఎన్నికల సమయంలో రౌడీషీటర్లను పోలీసులు అదుపు చేయలేదన్న విమర్శలు వచ్చాయి. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా కౌంటింగ్ రోజున రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి వారు పోలీసుల కనుసన్నల్లోనే ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కనబడాలని ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయానికి భద్రత..

కాగా గంగూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయానికి పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఇక్కడ 15 మంది ప్రత్యేక పోలీసులను పహారాకు ఉంచారు. జాతీయ రహదారి పక్కనే పార్టీ కార్యాలయం ఉండటంతో ఎటువంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అలాగే టీడీపీ నేతల ఇళ్ల వద్ద కూడా పోలీసులను ఉంచారు. ప్రధాన అభ్యర్థులను కలిసి సహకరించాలని పోలీసులు కోరారు.

విస్తృత తనిఖీలు..

కాగా అసాంఘిక శక్తులకు చెక్ పెట్టడానికి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారుల్లో తనిఖీలతో పాటు, గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేయడానికి స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల రోజు పోయిన పరువును కాపాడుకునే పనిలో పోలీసులు నియగ్నమయ్యారు.

సంపూర్ణ వికాసానికి యోగా అవసరం



ప్రసంగిస్తున్న యోగా గురువు యధాశక్తి గురూజీ

పెనమలూరు: సంపూర్ణ శారీరక, మానసిక వికాసానికి యోగా ఉపయోగపడుతుందని యోగాచార్యులు యధాశక్తి గురూజీ(శ్రీనివాసరావు) అన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఆదివారం శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో 58వ యోగా శిక్షణ ముగింపు, 59వ యోగా శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యోగా అంటే ఆసనాలు వేయడం ఒకటే కాదన్నారు. అష్టాంగయోగంలో అన్ని అంశాలు సాధన చేయడం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం పొంది సమాజానికి సేవ చేయవచ్చని వివరించారు. యోగాసనాలు ప్రదర్శించి చూపారు. యోగా శిక్షణ ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు ఉచితంగా 28 రోజులు ఉంటుందని ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. యోగా శిక్షణ ముగించుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గోసాల శాఖ యువయోగా గురూజీ, ఉప బోధన యోగాచార్యులు మునిజనవంధిత యోగి, ఆచార్య యోగి గురూజీ, హరికుమారి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): ఆనందోత్సాహాల నడుమ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నున్న గ్రామంలో జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1988-89 పదో తరగతి పూర్వ విద్యార్థులు విద్యార్థి దశలోని ఆ పాత మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన గురువులను గుర్తుచేసుకున్నారు. అమెరికాలో స్థిరపడిన భీమవరపు శివారెడ్డి, డాక్టరేట్ చేసిన పి.సుభాషిణీలను ఈ సందర్భంగా అభినందించారు. ఉన్నత స్థితిలో ఉన్న మనం సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని తీర్మాణం చేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్, నున్న సొసైటీ ఛైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 88-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ కోర్సులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా మంజూరైన ఇంటర్మీడియెట్ కోర్సులను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌ను ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీకి అప్‌గ్రేడ్ చేస్తూ అనుమతి మంజూరు చేయడంతో ఇంటర్మీడియెట్ తరగతులను ప్రారంభించారు. వీరవల్లి పరిసర ప్రాంతాల్లోని 15 గ్రామాలకు చెందిన బాలికలు ఇంటర్మీడియెట్ కోర్సుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఏలాంటి ఫీజులు చెల్లించకుండా సొంతూరులోనే చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మండల విద్యాశాఖాధికారి-2 బి.సురేష్‌కుమార్ తెలిపారు. ప్రతి విద్యార్థిని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల, జూనియర్ కాలేజీ ఇన్‌ఛార్జి ఆళ్ల కృష్ణారావు, గ్రామ ప్రముఖులు చిలకపాటి పద్మనాథం, అలుగుల దేవా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• గొయ్యి తీశారు.. పూడ్చటం మరిచారు



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్ల వాకర్స్, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బంది అవసరాల కోసం గ్రౌండ్‌లో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తాత్కాలిక మరుగుదొడ్లను తొలగించిన అధికారులు, వీటి కోసం తవ్విన గుంతలను మాత్రం పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఈ గుంతల నుంచి వెలువడే దుర్వాసనతో వాకర్స్, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్‌లో ఆడుకునేందుకు వచ్చే చిన్న పిల్లలు గోతుల్లో పడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు.

మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం

కంకిపాడు: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా పేర్కొన్నారు. ఈడుపుగల్లులోని సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజలకు ఏం మేలు చేసిందని సర్వే సంస్థలు ఎన్డీఏకు అత్యధిక స్థానాలు వస్తాయని ప్రకటించాయో అర్థం కావడం లేదన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలపై భారం పడటానికి మోదీ ప్రభుత్వమే కారణమన్నారు. అధిక పన్నులతో ప్రజల నడ్డి విరిచిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. నాయకుల మెప్పు కోసం కాకుండా ప్రజల మనోగతాన్ని తేటతెల్లం చేస్తే సర్వే సంస్థలకు గుర్తింపు ఉంటుందని స్పష్టంచేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెదపారుపూడి మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన కుంపటి రవికుమార్ తన తల్లి నవరత్నంతో కలిసి బైక్‌పై ఎనికేపాడులోని ఆస్పత్రికి బంధువును చూడటానికి శనివారం వెళ్లాడు. అతను తిరుగు ప్రయాణంలో కానూరు వందడుగుల రోడ్డులో వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. ఈ ఘటనలో రవికుమార్ కాలు విరిగింది. తల్లి నవరత్నం స్థానికుల సాయంతో కొడుకు రవికుమార్‌ను కామినేని ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం, గులాబీతోటలో ఆదివారం త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యాన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. హిందూ జ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షుడు జగీరపు సురేష్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాల తెలుసుకొనుట వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సభ్యులు శంకర్, సూరప్పడు, జయ, ప్రవీణ, తిరుపతి, చెంచు, సన్నీ, పైడప్పడు, చంద్రబాబు, సురేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కుప్పా కృష్ణవేణి కళాబృందానికి చెందిన చైత్ర, పూర్వజ, శ్రీహాస, తనివ్య, కావ్య, హేమశ్రీలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఆలయ అధికారులు కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పదో తరగతి టాపర్లకు సత్కారం



ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో విద్యార్థులు

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతిలో ప్రతిభ కనబర్చి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు అదే పట్టుదలతో ఉన్నత చదువులు అభ్యసించాలని డాక్టర్ పి.నిఖిల్ అన్నారు. స్పందన సేవాసమితి ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు 15 మందికి రూ. 25 వేల నగదు ప్రోత్సాహాలు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో ఆదివారం అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.నిఖిల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన పెనమలూరు ఈఓఆర్డీ కోరా శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు. స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ ఏపీ స్టేట్ అధ్యక్షురాలు డి.ప్రసన్న, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, సేవా సమితి ప్రతినిధులు పి.వీరబాబు, వై.కె.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి

- కౌంటింగ్ ఏజెంట్లు క్రమశిక్షణతో ఉండాలి
- 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు



రిటర్నింగ్ అధికారి రాజు

పెనమలూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపులో అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు విధిగా పాటించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. ఆదివారం ఆయన సాక్షికి వివరాలు తెలుపుతూ పెనమలూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఈనెల 4వ తేదీన మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో నిర్వహిస్తామన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 208 నెంబర్ రూమ్‌లో ఆరు టేబుళ్లలో ఓట్ల లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఇక సాధారణ ఓట్ల లెక్కింపునకు 201 రూమ్‌లో 14 టేబుళ్ల చొప్పున ఎంపీ, ఎమ్మెల్యేకి విడివిడిగా వేసి ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రతీ రౌండ్‌కు అరగంటలోపు సమయం పడుతుందని, ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్ స్లిప్పులు కూడా లెక్కించాల్సి ఉంటుందని చెప్పారు. మొదటి రౌండ్ ఫలితాలు ఉదయం తొమ్మిది గంటలకు వెలువడతాయని అన్నారు. మొ త్తం 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ రాత్రి వరకు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు తెలుసుకోవాలి

కౌంటింగ్‌లో పాల్గొనే కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు తెలుసుకోవాలని ఆర్ఓ రాజు తెలిపారు. ఏజెంట్లకు మంజూరు చేసిన పాస్‌లతో ఉదయం ఆరు గంటలకే రిపోర్టు చేయాలన్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక అభ్యర్థికి చెందిన ఏజెంట్‌ను మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఏజెంట్లు సెల్ ఫోన్‌లు తీసుకురాకూడదని తెలిపారు. ఏజెంట్ ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన తర్వాత బయటకు వెళ్లరాదని, ఒకవేళ బయటకు వెళితే తిరిగి లోపలకి అనుమతించమని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంట్లు క్రమశిక్షణ పాటించాలని గొడవలకు దిగితే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ ప్రకటించిన విధంగా యాప్‌లో వివరాలు ఉంచుతామని, అదేవిధంగా మీడియా పాయింట్‌కు కూడా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

డ్రైయిన్లల్లో పూడికతీత



చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో ఆదివారం సైడు డ్రెయిన్లల్లో పూడికతీశారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి మురుగునీరు సజావుగా పారుదల అయ్యేందుకు పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పారిశుద్ధ్య సిబ్బందితో డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, వాటర్ ట్యాంక్ బజారు, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతాల్లోని పలు డ్రెయిన్లల్లో ముమ్మరంగా పూడిక తీయించినట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై సమస్యలు ఏమైనా ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థుల ప్రతిభకు సమ్మర్ క్యాంపులు దోహదం



ముస్తాబాదలో చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గన్నవరంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పెనమలూరులో చెస్ ఆడుతున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: విద్యార్థుల్లోని ప్రతిభ, సామర్థ్యాల వెల్లడికి సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా ఆదివారం విద్యార్థులకు చెస్, న్యూస్ పేపర్‌లు చదవడం, నీతి కథలు చెప్పడం వంటి పోటీలు నిర్వహించారు. విద్యార్థుల సృజన పెంపునకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. పుస్తకాలు చదవడం వల్ల వారిలో మనో వికాసం పెరుగుతుందన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంపులో భాగంగా లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి పర్యవేక్షణలో చదరంగం, లూడో పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు, గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

కంకిపాడు: కంకిపాడులో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఆదివారం కూడా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. భగవద్గీత శ్లోకాలు, పుస్తక పఠనం చేయించారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ఉంగుటూరు: మండలంలోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు, న్యూస్ పేపర్ చదివించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, స్నేక్ అండ్ లేడర్, లెమన్ స్పూన్ వంటి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లో గ్రంథాలయ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శిబిరంలో ఆదివారం విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. విశ్రాంత హిందీ పండిత్ కంభంపాటి ధర్మారావు పర్యవేక్షణలో విద్యార్థులతో పలు యోగాసనాలు వేయించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ యోగా చేయాలని ధర్మారావు సూచించారు. దీనివల్ల మానసిక ప్రశాంతతో పాటు ఒత్తిళ్లను అధిగమించవచ్చని పేర్కొన్నారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్ దొండపాటి బాబురావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: పెనమలూరులో శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పెనమలూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో చెస్, లూడో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి పోటీలు నిర్వహిస్తున్నామని శాఖ గ్రంథాలయ అధికారిణి హరీష తెలిపారు.

నేరస్తుడికి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు, సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడుతున్న పోతిరెడ్డి రంగారెడ్డి అలియాస్ కోటిరెడ్డి నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన రంగారెడ్డి గతంలో పలు నేరాలకు పాల్పడి, అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లాడన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా మత్తు పదార్థాలు సేవించి నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలో నగరం నుంచి బహిష్కరించామన్నారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు తాజాగా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.